క్లుప్తంగా

అడిగిన సమాచారాన్ని తప్పనిసరిగా ఇవ్వాలి



మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీనివాస్

గుంతకల్లు రూరల్: సమాచార హక్కు చట్టం ద్వారా అప్పీలుదారులు అడిగిన సమాచారాన్ని తప్పనిసరిగా అందించాలని రాష్ట్ర సమాచారం ఐక్యవేదిక అధ్యక్షుడు లాలునాయక్ సూచించారు. మంగళవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో రాష్ట్ర సమాచార ఐక్యవేదిక ఆధ్వర్యంలో సమాచారహక్కు చట్టంపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్డీఓతోపాటు గుంతకల్లు రెవిన్యూ డివిజన్ పరిధిలోని గుంతకల్లు, ఉరవకొండ, వజ్రకరూరు, విడపనకల్లు, పామిడి, గుత్తి, యాడికి, పెద్దవడుగూరు మండలాల డిప్యూటీ తహసీల్దార్లు పాల్గొన్న ఈ కార్యక్రమంలో సమాచారహక్కు చట్టం గురించి వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు రాయల కొండయ్య, ట్రెజరర్ మల్లికార్జున, న్యాయవాది వీర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కనకదాస జయంతి విజయవంతం చేయండి

బుక్కరాయసముద్రం: అనంతపురం నగరంలోని గుత్తిరోడ్డులో ఉన్న కేటీఆర్ ఫంక్షన్ హాల్‌లో ఈ నెల 18న నిర్వహించే కనకదాస జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని కురుబ సంఘం నాయకులు కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎల్లమ్మ తల్లి దేవాలయంలో కురుబ సంఘం నాయకులు పోస్టర్లు విడుదల చేశారు. కురుబల సమస్యలపై ఐకమత్యంతో పోరాటాలు చేయాలన్నారు. కార్యక్రమంలో కురుబ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆంజనేయులు, జిల్లా అధ్యక్షుడు ఈశ్వరయ్య, కార్యదర్శి ఆవుల క్రిష్ణయ్య, లక్ష్మీనారాయణ, నారాయణస్వామి, నాగేంద్ర, రాజగోపాల్, అక్కులప్ప, వీరనారప్ప తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ హామీలు అమలు చేయాలి

గుంతకల్లుటౌన్: ఎన్నికలకు ముందు కూటమి నాయకులు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఎం పట్టణ ప్రధాన కార్యదర్శి బి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. మంగళవారం ఆర్టీసీ బస్టాండ్ సర్కిల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 14న సీపీఎం చేపట్టనున్న కలెక్టరేట్, తహసీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నా కార్యక్రమాలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆయన విడుదల చేశారు. పార్టీ నాయకులు మారుతి, నాగరాజు, తిమ్మప్ప, సురేంద్ర, రాము తదితరులు పాల్గొన్నారు.

ఇసుక తరలిస్తే కఠిన చర్యలు



ఇసుక తరలించకుండా సిబ్బందికి సూచనలిస్తున్న డీఎస్పీ వెంకటేశులు

శింగనమల: పెన్నానదిలో ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠినచర్యలు తప్పవని అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశులు హెచ్చరించారు. మంగళవారం మండలంలోని తరిమెల గ్రామం వద్ద పెన్నానదిలోని ఇసుకను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పెన్నానది పరివాహక ప్రాంతంలో అక్రమంగా ఇసుక రవాణా చేయకుండా పోలీసుల గస్తీ ఏర్పాటు చేశామన్నారు. హిటాచీలు, జేసీబీలు, టిప్పర్లు, భారీ వాహనాలు పెట్టి అక్రమంగా ఇసుక తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో వీఆర్ఓలు నవీన్‌కుమార్, ఓబిలేసు, హెడ్ కానిస్టేబుల్ బాషా, తిమ్మరాజు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే చర్యలు

తాడిపత్రి రూరల్: శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే చర్యలు తప్పవని డీఎస్పీ రామకృష్ణుడు హెచ్చరించారు. మండలంలోని గంగాదేవిపల్లిలో మంగళవారం రాత్రి అప్‌గ్రేడ్ రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డితో కలసి డీఎస్పీ తనిఖీ చేశారు. గ్రామంలోని రాయకీయ నాయకుల ఇళ్లను తనిఖీ చేశారు. రెండు వర్గాలకు చెందిన వారితో డీఎస్పీ మాట్లాడుతూ గ్రామంలో శాంతి భద్రతలను కాపాడేందుకు సహకరించాలని కోరారు. అనంతరం గ్రామంలోని పికెటింగ్‌ను తనిఖీ చేశారు.

వాహనాల తనిఖీ

యల్లనూరు: మండలంలోని తిరుమలాపురం క్రాస్ వద్ద మంగళవారం సాయంత్రం పుట్లూరు సీఐ సత్యబాబు ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. సీఐ మాట్లాడుతూ ద్విచక్రవాహనదారులు తప్పకుండా హెల్మెట్ వాడాలన్నారు. సరైన పత్రాలు లేని వాహనాలకు అపరాధ రుసుం విధించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ శ్రీరాం ప్రసాద్, ఏఎస్‌ఐ శ్రీనివాస్‌గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ



పామిడిలో మాట్లాడుతున్న గుంతకల్లు డీఎల్‌డీఓ విజయలక్ష్మి

గార్లదిన్నె/యాడికి/పామిడి/యల్లనూరు/పెద్దవడుగూరు: గార్లదిన్నెలోని ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక తయారీపై అధికారులకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ యోగానందరెడ్డి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు, గ్రామ పంచాయతీ నిధులు, మహిళా సంఘాల జీవనో పాధుల ప్రణాళిక, ఉపాధిహామీ పథకం లేబర్ బడ్జెట్ అన్నింటిని కలిపి 2025 -26 ఆర్థిక సంవత్సరానికి పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక తయారీ చేయాలన్నారు. అలాగే 17 సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు సాధించడంపై శిక్షణ ఇస్తామన్నారు. బుధవారం ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లకు శిక్షణ ఉంటుందన్నారు. యాడికిలో నిర్వహించిన శిక్షణలో ఎంపీడీఓ వీరరాజు, ఈఓపీఆర్డీ శశికళ, ఏఓ మహబూబ్‌బాషా, ఏపీఓ రమేష్, ఏపీఎం చంద్రశేఖర్ పాల్గొన్నారు. పామిడి ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో గుంతకల్లు డీఎల్‌డీఓ విజయలక్ష్మి మాట్లాడారు. ఎంపీడీఓ తేజోత్స్న, ఈఓఆర్డీ కృష్ణకుమార్, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, వీఓ ప్రెసిడెంట్లు పాల్గొన్నారు. అలాగే యల్లనూరు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన శిక్షణలో ఈఓఆర్డీ మనోహర్‌బాబు, పీఆర్ జేఈ నరేంద్ర, ఆర్‌డబూ జేఈ ప్రవీణ్, ఏపీఎం ముత్యాలప్ప, వైద్యులు లోకేష్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజామణి, ఏఓ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా పెద్దవడుగూరులో నిర్వహించిన శిక్షణలో ఎంపీడీఓ నరసింహారెడ్డి, అధికారులు పాల్గొన్నారు. బుక్కరాయసముద్రంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఎంపీడీఓ సాల్మాన్, ఎంపీపీ సునీత , ఈఓఆర్డీ సదాశివం పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

గుత్తి రూరల్: మండలంలోని సేవాగఢ్ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు భీమవరంలోని ఎస్‌సీహెచ్ బీఆర్ఎం ఉన్నత పాఠశాల వేదికగా రాష్ట్ర స్కూల్ గేమ్స్ అండర్-14, 17, 19 విభాగాల్లో జరిగిన రోప్ స్కిప్పింగ్ పోటీల్లో ఫ్రీస్టైల్ విభాగంలో గురుకులానికి చెందిన వి.సంతోష్‌నాయక్ మొదటి స్థానం, గ్రూప్ ఈవెంట్‌లో బంగారు కప్, డబుల్స్ అండర్-19లో బ్రాంజ్ మెడల్ సాధించాడు. మరో విద్యార్థి ఎస్.నందీశ్వర్ అండర్-17 ఫ్రీస్టైల్ విభాగంలో బంగారం మెడల్, స్పీడ్ విభాగంలో సిల్వర్ మెడల్ సాధించి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించాడు. ప్రతిభ చాటిన విద్యార్థులను మంగళవారం గురుకులంలో ప్రిన్సిపాల్ ఫయాజ్, వైస్ ప్రిన్స్‌పాల్ రవీంద్రబాబు, ఉపాధ్యాయుడు వేణుగోపాల్, పీడీలు రాజేష్, చిన్ని కృష్ణనాయక్, పీఈటీ విజయకుమార్ నాయక్ అభినందించారు.

నేడు తెప్పోత్సవం

శింగనమల: శింగనమల శ్రీరంగరాయుల చెరువులో కార్తీక ద్వాదశిని పురస్కరించుకుని బుధవారం తెప్పోత్సవం నిర్వ హించడానికి గ్రామస్తులు, మత్స్యకారులు ఏర్పాట్లు చేశారు. చెరువులో తెప్పను మత్స్యకారులు కట్టి సిద్ధం చేశారు. తెప్పపైన ఆత్మసీతారామస్వామి, గొల్లకొండ వెంకటరమణస్వామి, వాసవీమాతను ఊరేగించనున్నారు.

వ్యక్తి ఆత్మహత్య

యాడికి: మద్యంలోకి పురుగుల మందు కలుపుకుని తాగి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. మండలంలోని ఓబుళాపురానికి చెందిన పండరీనాథ్ (36), మీనా దంపతులకు ఇద్దరు కుమారులు, కూతురు. గొర్రెల వ్యాపారం చేసుకుంటూ జీవనం కొన సాగిస్తున్న పండరీనాథ్‌కు వ్యాపారంలో రూ.3 లక్షలు నష్ట పోగా, కుమారుడి అనారోగ్య సమస్యతో రూ.2లక్షలు ఖర్చైంది. అప్పు తీర్చే మార్గం కానరాక తాగుడుకు బానిసయ్యాడు. అప్పుల వారి వేధింపులు తాళలేక మంగళవారం రాత్రి 9గంటల సమయంలో మద్యంలో పురుగుల మందు కలుపుకుని తాగి అపస్మారక స్థితిలో పడిపోయాడు. కుటుంబ సభ్యులు వెంటనే తాడిపత్రి ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందాడని వైద్యులు ధ్రువీకరించారు.

న్యాయ సేవా దినోత్సవం

యాడికి: స్థానిక ఎంపీడీఓ సమావేశ భవనంలో ఎంపీడీఓ వీరరాజు ఆధ్వర్యంలో మంగళవారం న్యాయ సేవ దినోత్సవం నిర్వహించారు. తాడిపత్రి లాయర్లు శివరామకృష్ణ, కొండయ్య మాట్లాడుతూ బలహీన వర్గాలకు ఎలాంటి రుసుము లేకుండా న్యాయ సేవ లందించడమే న్యాయ సేవల దినోత్సవ లక్ష్యమన్నారు. ఎంపీడీఓ వీరరాజు, తాడిపత్రి సీడీపీఓ సాజిదాబేగం, సీఐ ఈరన్న పాల్గొన్నారు.

కార్మిక సమస్యల పరిష్కారమే అజెండా



మాట్లాడుతున్న ఎన్ఎఫ్ఐఆర్ జాతీయ కార్యదర్శి రాఘవయ్య

గుంతకల్లు: రైల్వే కార్మికుల సమస్యల పరిష్కారమే ప్రధాన అజెండాగా ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్లు నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రైల్వేమెన్ (ఎన్ఎఫ్ఐఆర్) జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మర్రి రాఘవయ్య స్పష్టం చేశారు. డిసెంబర్ 4, 5, 6వ తేదీల్లో జరిగే రైల్వే కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికల ప్రచారంలో భాగంగా దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ అసిస్టెంట్ జనరల్ సెక్రటరీ ఎం.భరణీభానుప్రసాద్‌తో కలసి మంగళవారం గుంతకల్లులో ఆయన ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ గుంతకల్లు డివిజన్ ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్, అధ్యక్షుడు డీఎస్ రెడ్డిల బృందం ఆయనకు ఘన స్వాగతం పలికారు. తొలుత రైల్వే ఆస్పత్రి సమీపంలోని ఎంప్లాయిస్ సంఘ్ కార్యాలయం నుంచి వందలాది కార్మికులతో మర్రిరాఘవయ్య, భరణీభానుప్రసాద్, కె.ప్రభాకర్ ఓపెన్ టాప్ వాహనంపై భారీ ఊరేగింపుగా డీఆర్ఎం కార్యాలయానికి చేరుకున్నారు. అనంతరం లంచ్ అవర్‌లో ఏర్పాటు చేసిన సభలో మర్రి రాఘవయ్య మాట్లాడారు. కార్మికుల హక్కుల సాధనకు అనేక సుదీర్ఘ పోరాటాలు చేసినట్లు గుర్తు చేశారు. పాత పెన్షన్ విధానాన్ని సాధించాలంటే ఒక్క ఎంప్లాయిస్ సంఘ్‌తోనే సాధ్యమవుతుందన్నారు. రైలింజన్‌పై ఓటు వేసి ఎంప్లాయిస్ సంఘ్‌కు మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. అనంతరం మజ్దూర్ యూనియన్ నుంచి ఎంప్లాయిస్ సంఘ్‌లోకి చేరిన పలువురు ఉద్యోగులను వారు సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎంప్లాయిస్ సంఘ్ అన్ని బ్రాంచ్‌ల అధ్యక్ష, కార్యదర్శులు, కార్మికులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహన దొంగల అరెస్ట్



నిందితులను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

తాడిపత్రి టౌన్: ద్విచక్ర వాహనాలను అపహరించుకెళుతున్న ముగ్గురు యువకులను తాడిపత్రి పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ సాయిప్రసాదరెడ్డి తెలిపిన మేరకు... మంగళవారం ఉదయం చుక్కలూరు బ్రిడ్జి వద్ద పోలీసులు వాహన తనిఖీలు చేపట్టిన సమయంలో అటుగా వచ్చిన పాత నేరస్తులు తలారి నారాయణ, ముచ్చుకోట పెద్దన్న అలియాస్ చిన్నా, దూదేకుల తెలికి రఫీని అడ్డుకుని వారి వాహనాలను తనిఖీ చేశారు. ఎలాంటి రికార్డులు లేకపోవడంతో.. వాటిని అపహరించుకెళ్లినట్లుగా నిర్ధారణ అయింది. జల్సాలకు అలవాటు పడిన తలారి నారాయణ, ముచ్చుకోట పెద్దన్న ద్విచక్ర వాహనాలను అపహరించి తెలికి రఫీ ద్వారా విక్రయించి, వచ్చిన సొమ్ముతో తమ సరదాలు తీర్చుకునేవారు. నిందితుల నుంచి ఆరు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకుని, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

యువకుడి బలవన్మరణం

యల్లనూరు: జీవితంపై విరక్తితో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... యల్లనూరు మండలం లక్ష్మంపల్లికి చెందిన రవీంద్ర (30)కు పదేళ్ల క్రితం వివాహమైంది. సంతానం కలగక పోవడంతో పాటు అనారోగ్య సమస్యలు తలెత్తాయి. జీవితంపై విరక్తి పొందిన ఆయన సోమవారం రాత్రి భోజనం ముగించుకున్న అనంతరం భార్య నిద్రిస్తుండగా అర్ధరాత్రి ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి గోవిందు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

అదనపు కట్నం వేధింపులపై కేసు నమోదు

యాడికి: అదనపు కట్నం కోసం వేధింపులకు గురి చేస్తున్న భర్తపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు.. యాడికిలోని రాఘవేంద్ర కాలనీకి చెందిన చౌడయ్యకు స్థానిక చంద్రకళతో మూడేళ్ల క్రితం వివాహమైంది. మగ్గం నేస్తూ జీవనం సాగిస్తున్న వీరికి ఏడాది వయసున్న కుమార్తె ఉంది. కొంత కాలంగా చెడు అలవాట్లకు బానిసైన చౌడయ్య అదనపు కట్నం తీసుకురావాలంటూ తరచూ భార్యను వేధిస్తుండేవాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు చౌడయ్యపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

విద్యార్థులమధ్య గొడవ..

తాడిపత్రి టౌన్: పట్టణంలోని ఓ కళాశాలలో విద్యార్థుల మధ్య చోటు చేసుకున్న చిన్నపాటి గొడవ తీవ్ర దుమారం రేపింది. వివరాలు... తాడిపత్రి - యల్లనూరు మార్గంలోని ఓ ప్రైవేట్ జూనియర్ కళాశాలలో ఇంటర్ సీఈసీ చదువుతున్న విద్యార్థి, ఎంపీసీ చదువుతున్న విద్యార్థి తాగునీటి విషయంగా ఘర్షణ పడ్డారు. ఈ క్రమంలో సీఈసీ విద్యార్థిపై ఎంపీసీ విద్యార్థులు దౌర్జన్యానికి దిగారు. దీంతో సీఈసీ విద్యార్థి తన స్వగ్రామం తాడిపత్రి మండలం పట్టగిత్తపల్లిలోని తల్లిదండ్రులకు ఫోన్ చేసి విషయం తెలపడంతో దాదాపు ఆరుగురు కళాశాలకు చేరుకున్నారు. అదే సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి సీఈసీ విద్యార్థి బంధువులపై కట్టెలు, రాళ్లతో దాడి చేయడంతో రంగనాయకులు అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.

పాత కక్షలతో వ్యక్తిపై దాడి

పెద్దవడుగూరు: మండలంలోని క్రిష్టిపాడు ఎస్సీ కాలనీలో పాత కక్షల నేపథ్యంలో నరసింహ అనే వ్యక్తిపై చిన్న ఓబిలేసు, పెద్ద ఓబిలేసు కుటుంబ సభ్యులు. మంగళవారం దాడి చేశారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు.

సంక్షిప్త సమాచారం

నేడు కబడ్డీ క్రీడాకారుల సమావేశం

గుంతకల్లు: స్థానిక రైల్వే ఇన్స్టిట్యూట్‌లో బుధవారం సాయంత్రం జిల్లా కబడ్డీ క్రీడాకారుల ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జిల్లా మాజీ అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.హరినాథ్‌గౌడ్, వి.సుంకప్పు, ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ మాజీ సెక్రటరీ వి.వీరలంకయ్య మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

విద్యార్థులు పట్టుదలతో చదవాలి

గుంతకల్లు: పట్టుదలతో చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని కసాపురం నెట్టికంటి ఆంజినేయస్వామి ఆలయ ఈఓ వాణి, టూటౌన్ సీఐ ఏపీ మస్తాన్ సూచించారు. నవంబర్ 14 బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం పట్టణంలోని సరోజనీనాయుడు గ్లర్స్ హైస్కూల్‌లో జేవీవీ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలను నిర్వహించారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. జేవీవీ రాష్ట్ర కార్యదర్శి హరిప్రసాద్, స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ ఆర్ఎస్ శ్రీనివాస్, స్కూల్ విద్యా కమిటీ చైర్మెన్ దామోదర్, నాయకులు చంద్రశేఖర్, చిట్టిబాబు పాల్గొన్నారు.

గ్యాస్ లీకేజీ.. మహిళకు గాయాలు

పెద్దవడుగూరు: మండలంలోని కోనాపురంలో గ్యాస్ లీకేజీ కావడంతో మంటలు చెలరేగి బాలనాగమ్మ అనే మహిళకు తీవ్ర గాయాలైన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. వివరాలు.. బాలనాగమ్మ, ఆమె కుమారుడు నివాసం ఉంటున్నారు. తెల్లవారుజామున వంట తయారు చేసుకోవడం కోసం గ్యాస్ ముట్టించడంతో.. అప్పటికే గ్యాస్ లీక్ అయి ఉండడంతో మంటలు చెలరేగాయి. పెద్ద శబ్దం రావడంతో స్థానికులు భయభ్రాంతులకు లోనయ్యారు. తీవ్రంగా గాయపడిన బాలనాగమ్మను కుమారుడు రాయలచెరువు లోని ప్రైవేట్ ఆస్పత్రికి, అట్నుంచి అనంతపురం తరలించాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

'వైద్యులను బ్లాక్‌మెయిల్ చేయడం మానాలి'

పామిడి: అంకితభావంతో విధులు నిర్వరిస్తున్న వైద్యులపై బ్లాక్‌మెయిల్ చేయడం మానుకోవాలని పట్టణ కమ్యూనిటీ ఆసుపత్రి వైద్యాధికారి జీ శివకార్తీక్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక కమ్యూనిటీ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత నెల 26న జిల్లా కలెక్టరేట్‌లో పామిడి కమ్యూనిటీ ఆస్పత్రి వైద్యసిబ్బందిపై అవినీతి ఆరోపణలు చేస్తూ చేసిన ఫిర్యాదుపై ఆయన మాట్లాడారు. ఆస్పత్రిలో కాంట్రాక్ట్ ఉద్యోగం ఇవ్వలేదన్న నెపంతో వైద్యులపై అభాండాలు వేయడం పద్ధతి కాదన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు కిరణ్మయి, మహేష్, రాఘవేంద్రరెడ్డి, కమలాకర్ పాల్గొన్నారు.

మాజీ కౌన్సిలర్ గిడ్డమ్మ మృతి

గుత్తి: పట్టణంలోని ఎస్సీ కాలనీకి చెందిన నగదాని గిడ్డమ్మ(81) అనారోగ్యంతో అనంతపురం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందింది. మృతురాలికి నలుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వైఎస్సార్‌సీపీ, టీడీపీ, సీపీఐ , సీపీఎం నాయకులు, కార్యకర్తలు గిడ్డమ్మ మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు.

'ఆరోగ్య ఆస్పత్రిపై చర్యలు తీసుకోండి'

పామిడి: పట్టణంలోని ఎద్దులపల్లి రోడ్డులో ఉన్న ఆరోగ్య ఆసుపత్రి ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతుండడంపై సమగ్ర విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలంటూ ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యద ర్శి సాకే ఓబులేసు డిమాండ్ చేశారు. పామిడిలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉన్నతాధికారులు స్పందించి అనుమతి లేని ప్రైవేట్ ఆస్పత్రులపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

'మార్వాడీలు షాపులు నిర్వహించొద్దు'

గార్లదిన్నె: మండల కేంద్రంలో మార్వాడీలు వ్యాపార దుకాణాలు నిర్వహించకూడకుండా చర్యలు తీసుకోవాలని గార్లదిన్నె వ్యాపారులు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వ్యాపారులు మాట్లాడుతూ మార్వాడీలు షాపులు నిర్వహిస్తే స్థానిక వ్యాపారులకు ఇబ్బందిగా ఉంటుందన్నారు. నాలుగు రోజుల క్రితం మార్వాడీలు స్టీల్ హౌస్ షాప్ ప్రారంభించారన్నారు. షాపు వెంటనే మూసి వేయించాలన్నారు. రెండు నెలలు తర్వాత మార్వాడీ షాపు మూసివేస్తామని తెలిపారన్నారు.

బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా శ్రీనివాసరాజు

గుంతకల్లుటౌన్: బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) గుంతకల్లు నియోజకవర్గం ఇన్‌చార్జ్‌గా బి.శ్రీనివాసరాజు నియమించారు. ఈమేరకు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గద్దల నాగభూషణం మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.